# నేను ఈ గడ్డ బిడ్డను




## ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా

- సేవా కార్యక్రమాలతో ప్రజల మధ్యే ఉన్నా
- ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులంతా స్థానికేతరులే
- నా ప్రచారానికి ప్రజల నుంచి స్పందన బాగున్నది
- లక్ష ఓట్లు సాధిస్తామన్న నమ్మకమున్నది
- బీడీ కార్మికులందరికీ పెన్షన్ అన్న సీఎం ప్రకటన కోరుట్ల ఆడబిడ్డలకు బహుమతి
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): 'నేను ఎన్నో ఏండ్ల నుంచి ప్రజాక్షేత్రంలోనే ఉన్నా. సేవా కార్యక్రమాలతో చేరువయ్యా. ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా తిరుగుతున్నా. సీఎం కేసీఆర్ దార్శనికత, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నిజాయితీ వల్ల ప్రజల్లో స్పందన అపూర్వంగా ఉన్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపే కాదు, లక్ష ఓట్లు సాధిస్తానన్న విశ్వాసం ఏర్పడింది' అని కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధీమా వ్యక్తం చేస్తున్నారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచార పర్వంలో బిజీగా ఉన్న ఆయన, 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన మాటల్లోనే..

**నమసే : బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు కదా..? ప్రజల స్పందన ఎలా ఉన్నది?**

కల్వకుంట్ల సంజయ్: నేను చాలా ఏండ్ల నుంచే ప్రజాక్షేత్రంలో ఉన్నా. కాకపోతే రాజకీయ నాయకుడిగా కాదు, ఒక వైద్యుడిగా, ఎమ్మెల్యే కొడుకుగా నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులోనే ఉన్నా. అయితే అభ్యర్థిగా ఆగస్టులో ప్రకటించినప్పటి నుంచి ప్రచారంలో ఉ న్నా. నేను ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. బీఆర్ఎస్ చేస్తు న్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, సీఎం కేసీఆర్ మార్గదర్శనం, కోరుట్ల ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గారి నిజా యితీ నాకు మంచి ఆదరణను తెచ్చిపెట్టిందనే చెప్పాలి.

**నమస్తే : వైద్య వృత్తిలో ఉన్న మీరు ఇప్పుడు ప్రజాక్షేత్రంలో రావడం ఎలా అనిపిస్తున్నది?**

కల్వకుంట్ల సంజయ్ : నేను వైద్య వృత్తిలో ఉన్నా నాకు ప్రజాక్షేత్రంలో పనిచేయడం కొత్తేమి కాదు. వైద్య వృత్తి సైతం ప్రజలతో మమేకమై చేసేదే కదా. అయితే అక్కడ పేషెంట్, పేషెంట్ బంధువులు మాత్రమే ఉంటారు. ఇక్కడ విస్తృత స్థాయి ప్రజా సమూహం ఉంటుంది. అయితే రోజుకు 16 గంటల పాటు ప్రజాక్షేత్రంలోనే ఉండడం, భిన్నవర్గాల ప్రజలతో కలువడం, వారి సమస్యలు తెలుసుకోవడం మాత్రం పరీక్షలు రాస్తున్న అనుభవాన్ని ఇస్తున్నాయి. డాక్టర్ కోర్సు చదివేటప్పుడు పరీక్షలకు రోజుకు పది, పన్నెండు గంటలు సన్నద్ధమైన అనుభవం ఉంది. అయితే ప్రజాక్షేత్రంలో సన్నద్ధం కావడం మాత్రం కొంత భిన్నమైన అనుభవమే.

**నమస్తే : జనంతో మమేకం అయ్యారు. గెలుస్తానన్న నమ్మకం ఏర్పడిందా..?**

కల్వకుంట్ల సంజయ్ : నేను నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉన్నా. కోరుట్లలో కచ్చితంగా గెలుస్తానన్న నమ్మకం కలుగడం కాదు, లక్ష ఓట్లు సాధిస్తానన్న విశ్వాసం ఉంది. అరవై ఏండ్లలో జరగని అభివృద్ధి కోరుట్ల నియోజకవర్గంలో తొమ్మిదిన్నరేండ్లలో జరిగింది. అలాగే సంక్షేమ ఫలాలు ఈ దశాబ్దకాలంలో అందినట్లుగా ప్రజలకు ఎప్పుడూ అందలేదు. దాదాపు 85వేల మందికి పెన్షన్లు, వేలాది మందికి సీఎంఎఫ్ఆర్ సాయం, రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, నీటిపారుదల సౌకర్యం, మిషన్ కాకతీయ, పరిపాలన వికేంద్రీకరణ అన్ని జరిగాయి. వాటి ఫలాలు అందుకున్న ప్రజల నుంచి మంచి ఆదరణ కనిపిస్తున్నది. కోరుట్లలోనే కాదు, రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ 85 శాతం సీట్లను, 75 శాతం ఓట్లను కైవసం చేసుకుంటుంది. జయం మనదే అన్న విశ్వాసం గుండెల నిండా ఉంది.

**నమస్తే : నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి?**

కల్వకుంట్ల సంజయ్ : ప్రచారం చేస్తున్న టైంలో కొన్ని సమస్యలు ప్రజలు చెప్పారు. కొన్నింటిని నేను గుర్తించాను. ముఖ్యంగా కోరుట్ల, మెట్‌పల్లి వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ పట్టణాల్లో రోజురోజుకూ జనాభా పెరుగుతున్నది. చుట్టుపక్కల ప్రాంతాలైన కథలాపూర్, మేడిపల్లి, నిజామాబాద్ జిల్లాలోని చివరి గ్రామాల వారు సైతం ఈ పట్టణాలకు వలస వస్తున్నారు. వారంతా సౌకర్యాలు కావాలని కోరుకుంటున్నారు. పట్టణాధికారులు ఎంత వేగంగా పనులు చేసినా రోజురోజుకూ కొత్త సమస్యలు వస్తూనే ఉన్నాయి. రోడ్లు కావాలని, మురుగు కాలువలు కావాలని, వీధి దీపాలు కావాలని కోరుతున్నారు. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరిస్తా. అలాగే యువతకు ఉన్నత చదువుల కోసం పీజీ కాలేజీలు, సాంకేతిక కాలేజీలను స్థాపించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నా. అలాగే ఉపాధి అవకాశాల కల్పన కోసం కొన్ని పరిశ్రమలను స్థాపించాలి. ఇండ్లు లేని నిరుపేదల సంఖ్య కొంత ఎక్కువగానే ఉంది. వారికి డబుల్ బెడ్ రూమ్ ఇం డ్ల నిర్మాణంతో పాటు, గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తా. కోరుట్లలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఏర్పడగానే వీటిని సాధించేందుకు కృషి చేస్తా.

**నమసే : దళితబంధు, బీసీ కులాల వారికి ఆర్థిక సాయ పథకాలపై మీ ఉద్దేశం ఏంటీ ?**

సంజయ్ కల్వకుంట్ల : దళితబంధు, బీసీ కుల వృత్తులకు ఆర్థిక సాయం పథకాలను ప్రజలు చాలా మంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. దళిత బంధు, బీసీ ఆర్థిక సాయం పథకాలు కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉద్దేశించినవి. ఈ పథకాల కింద సాయం పొందిన వారు, వ్యాపారవేత్తలుగా, వృత్తి నైపుణ్యదారులు గా మారి, వాటి సాయంతో ఆర్థిక స్వావలంభన సాధించి, భవిష్యత్తులో మరింత ఆర్థిక వృద్ధికి దోహదపడాలన్నదే ఈ పథకాల ఉద్దేశం. అయితే ఈ పథకాలను ఉచిత పథకాలుగా ప్రతిపక్షాలు ప్రచారం చేయడం సరికాదు. దళితబంధు పథకంలో లబ్ధి పొందిన మల్లాపూర్ మండల యువకుడు రెండు రోజుల క్రితం కలిశాడు. సార్ ట్రాక్టర్ కొన్నా.. ఈ యేడాదిలో మంచి లాభాలు వచ్చాయని చెప్పిండు. నాకు చాలా సంతోషం వేసింది. వచ్చే ఏడాది వరకు మరో ట్రాక్టర్ కొనాలని చెప్పా. దళితబంధు పథకానికి రానున్న రోజుల్లో మరింతగా నిధులు పెరుగుతాయి. సాగునీటి ప్రాజెక్టులు సంపూర్ణ దశకు వచ్చాయి. ఈ రంగాలకు కేటాయింపులు తగ్గుతాయి. తర్వాత దళితబంధు లాంటి ఎంపవర్‌మెంట్ పథకాలకే ప్రాధాన్యం ఇస్తారు.

**నమస్తే : సీఎం కేసీఆర్ కోరుట్లలో బహిరంగ సభలో పాల్గొన్నారు కదా..? ఆ సభ మీ గెలుపునకు ఎంత వరకు దోహదం చేస్తుంది?**

కల్వకుంట్ల సంజయ్ : సీఎం కేసీఆర్ సభ కోరుట్లలో అద్భుత విజయవంతమైంది. లక్ష మంది ప్రజలు సీఎం కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన మాట వినేందుకు ఉత్సాహంగా తరలివ చ్చారు. సీఎం కేసీఆర్ సభలో ప్రసంగిస్తూ రాజ కీయ పరిస్థితులను, ప్రస్తుత సందర్భాన్ని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడిన ప్రతి మాట విశేషంగా ఆకట్టుకున్నది. ప్రజల్లో మంచి స్పందన కనిపించింది. ముఖ్యంగా సీఎం కేసీఆర్ కోరుట్ల వేదికగా పెన్షన్ రాకుండా మిగిలిపోయిన బీడీ కార్మికులందరికీ పెన్షన్ ఇస్తానని ప్రకటించడం కోరుట్ల ఆడబిడ్డలకు ఇచ్చిన కట్నంగా భావిస్తున్నా. అలాగే కోరుట్ల పట్టణంలో చేనేత కార్మిక కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే చేనేత కార్మికుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ నిధులు ఇస్తామని ప్రకటించడం సైతం సంతోషం కలిగించింది. సీఎం కేసీఆర్ సభ నా గెలుపును తథ్యం చేసింది.

**నమస్తే : ప్రతిపక్ష పార్టీలు విమర్శలు ఎలా ఉన్నాయి? వాటిపై మీ సమాధానం?**

సంజయ్ కల్వకుంట్ల : ప్రతిపక్ష పార్టీలకు బేసిక్‌గానే విమర్శించేందుకు అర్హత లేదు. అవ కాశం లేదు. కాంగ్రెస్, బీజేపీలు చేసేవన్నీ అబద్ధపు, అసంబద్ధపు ఆరోపణలే. ప్రజలు వాటి ని పట్టించుకోవడమే మానేశారు. కోరుట్లలో పోటీ లో ఉన్న అభ్యర్థులు, నాపై విమర్శలు చేసేందుకు ఏం లేక తప్పుడు ఆరోపణలకు దిగారు. కమీషన్ల డాక్టర్‌ను అంటున్నారు. ఇది పూర్తిగా శుద్ధతప్పు. దాదాపు పదిహేనేండ్లుగా వైద్యుడిగా సేవ చేస్తున్నాను. హైదరాబాద్ స్థాయిలో కోరుట్ల వారికి వైద్యసేవలు తక్కువ ఖర్చుతో అందించా. ఈ ప్రాంత ప్రజలు ఏ రాత్రి ఫోన్ చేసినా స్పందించా. కరోనా కాలంలో ఇక్కడే ఉండి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పా. వేలమంది పిల్లలకు సొంత డబ్బులతో వ్యాక్సినేషన్ చేయించా. ఆక్సీజన్ కిట్లు అందించా. అలాంటి నాపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు. ఇప్పుడు నాపై మాట్లాడు తున్న ప్రత్యర్థులు కరోనా కాలంలో ఒక్కరోజు కాదు కదా, ఒక గంటసేపు ఇక్కడికి రాలేదు. ప్రజలకు ధైర్యం చెప్పలేదు. నేను ఎలాంటి వాడి నో కోరుట్ల నియోజకవర్గంలో ఉన్న రెండులక్షల ముప్పై వేల మందికి తెలుసు. వారి తప్పుడు ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు.

**నమస్తే : సీఎం కేసీఆర్ కోరుట్ల సభలో డాక్టర్ సంజయ్ నా బిడ్డలాంటివాడు. ఆమరణ దీక్ష సమయంలో నన్ను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు అన్నారు. దీనిపై మీ స్పందన ఏంటీ?**

సంజయ్ కల్వకుంట్ల : సీఎం కేసీఆర్ లాంటి దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు లక్షమంది ఉన్న సభలో డాక్టర్ సంజయ్ నా బిడ్డలాంటి వాడు, పుట్టిన గడ్డకు సేవ చేయడానికి కోట్లు సంపాదించే డాక్టర్ వృత్తిని వదిలిపెట్టి వచ్చాడనడం, అలాగే 2009లో ఆమరణ దీక్ష సమయంలో డాక్టర్‌గా నా పక్కనే ఉండి. నిమిషనిమిషం కాపాడాడు అని పేర్కొనడం నాకు అమిత ఆనందాన్ని కలిగించాయి. అంతటి గొప్ప వ్యక్తి నోటి వెంట నాపేరు రావడం నా జన్మకు సార్థకత కలిగించింది. ఆ క్షణం నా జీవితంలో మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగుతా.

**నమస్తే : కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు..?**

సంజయ్ కల్వకుంట్ల : ప్రజలకు నేనే చేసే అప్పీల్ ఒక్కటే. నేను ఈ గడ్డపై పుట్టిన బిడ్డను. మిగిలిన ప్రత్యర్థులు. వేరే ప్రాంతం నుంచి వచ్చిన బిడ్డలు. ఈ ప్రాంతంపై నాకు ఎక్కువ ప్రేమ ఉంటుందో, ఇతరప్రాంత బిడ్డలకు ప్రేమ ఉంటుందో ఆలోచించండి. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పురోగమిస్తున్న బీఆర్ఎస్‌కు. సీఎం కేసీఆర్‌కు మద్దతును ఇవ్వండి. ప్రతిపక్ష రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారానికి మోసపోకండి. ఈ ప్రాంత బిడ్డను ఆశీర్వదించండి. అన్నదే నా విన్నపం. నా అప్పీల్.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే

- ప్రజలంతా బీఆర్ఎస్‌ను కోరుకుంటున్నరు
- మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను చేసుకుంటరు
- వంద స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుంది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: అభివృద్ధి పథంలో ముందుకుసాగుతున్న తెలంగాణలో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరి మాదిరిలా చేస్తారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడోసారి జరుగుతున్న ఈ ఎన్నికలు చాలా ప్రాముఖ్యం కలిగినవని చెప్పారు. రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. సాధించిన రాష్ట్రాన్ని తర్వాత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ప్రజలందరూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీకి అధికారం ఇచ్చారన్నారు. ప్రస్తుతం మూడో సారి జరుగుతున్న ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ చేతుల్లో ఉంటేనే తెలంగాణ భద్రంగా ఉంటుందని, అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. తెలంగాణను కుక్కలు చింపిన విస్తరి చెయ్యబోమని, మరోసారి కేసీఆర్ ప్రభుత్వానికే అధికారం కల్పిస్తామని చెబుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న సమయంలో, సరైన నాయకుడికి అధికారం ఇవ్వాలన్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం ఆగమవుతుందన్నారు. కాంగ్రెస్ గోదావరి నదిపై ఎస్సారెస్పీ ప్రాజెక్టు ఒక్కటి మాత్రమే కట్టిందని, ఎల్ఎండీ మినహాయిస్తే ఒక్క రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు మూడు బ్యారేజీలు, 20రిజర్వాయర్లు నిర్మించారని, దూరదృష్టి ఉన్న నాయకుడు ఉంటే ఇలాంటి అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలు ఉంటే, అందులో రెండు స్వాతంత్రం రాకముందు ఏర్పడినవేనన్నారు. కాంగ్రెస్ పార్టీ కట్టింది రెండే రెండు మెడికల్ కాలేజీలు అని తెలిపారు. కేసీఆర్ హయాంలో 35మెడికల్ కాలేజీలు నిర్మించగా, మారుమూల పట్టణాల్లోనూ 500 పడకల దవాఖానలు, మల్టీస్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. నాటి కాంగ్రెస్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకుంటరు.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారని శాపనార్థాలు పెట్టారన్నారు. నేడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నాడని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రాత్రివేళ టార్చిలైట్ పట్టుకొని తిరగాల్సి వస్తుందేమోనన్నారు. ఎన్టీఆర్ కిలో రెండు రూపాయల చొప్పున కిలో బియ్యం ఇస్తున్న సమయంలో, కాంగ్రెస్ రూ.1.99కి ఇస్తామని ప్రజల్లోకి వస్తే ప్రజలు తిప్పికొట్టారన్నారు. బీఆర్ఎస్ పథకాలను తాము రెట్టింపు ఇస్తామని వస్తున్న కాంగ్రెస్‌కు అదే పరిస్థితి వస్తుందన్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటక, చత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో రైతు బంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. 'ప్రజల్ని మోసం చేయాలి' అని రేవంత్‌రెడ్డి అంటున్న వీడియో సోషల్ మీడియా వైరల్ అవుతుందన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు 80కిపైగా స్థానాలు వచ్చాయని, ఈ సారి వంద స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ ప్రత్యర్థి పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని మోదీ, అమిత్‌షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ అంటున్నారని, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని.. అందుకే కవిత అరెస్ట్ కాలేదని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారన్నారు. ఏ కుర్చీలో అయితే కవితను విచారణ చేశారో.. అక్కడే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని సైతం విచారణ చేశారని, వారిని అరెస్ట్ చేయలేదన్నారు. మరీ నేను కాంగ్రెస్, బీజేపీ ఒకటే.. అని అంటున్నానా.. అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్సకాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఒజ్జల అగ్గిరాములు, తదితరులు పాల్గొన్నారు.